సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు చర్యలు

విశాలాంధ్ర - అమలాపురం : సుస్థిర అభివృద్ధి లక్ష్యాలే ధ్యేయంగా ఆహార భద్రతను కల్పించి, పోషకత్వాన్ని మెరుగుపరిచేందుకు జిల్లా కలెక్టర్లు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్రధాన కార్యదర్శి క్యాంపు కార్యాలయం నుండి వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రాధాన్యత భవనాల నిర్మాణాలు పూర్తయిన భవనాలు అప్పగింత, ఒకే జిల్లా ఒకే ఉత్పత్తి, ఎస్సీడీ సర్వే, ప్రభుత్వ పథకాలు ఫోకస్ ద్వారా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధన, పాఠశాల విద్య జగనన్నకు చెబుదాం కార్యక్రమాల పురోగతిపైన నూతనంగా చేపట్ట నున్న, ఆడుదాం ఆంధ్ర, కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధనకు ఆరోగ్య సంరక్షణ, నాణ్య మైన విద్య అందించడంలో పాటుగా మహిళా సాధికారతను పెంపొందించాలన్నారు. తాగునీటి వసతిని కల్పించడం, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, అంశాల ద్వారా అసమానతల తొలగించి లక్షిత వర్గాల జీవన ప్రమాణాలు పెంపుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఓ వెంకటేశ్వర్లు, డిపిఓ కృష్ణకుమారి ద్వామా పిడి ఎస్ మధుసూదన్, పంచాయతీ రాజ్ గ్రామీణ నీటి సరఫరా ఎస్సీలు చంటిబాబు, కృష్ణారెడ్డి, డిసిహెచ్ఎస్ పద్మశ్రీరాణి, డిఆర్డిఏపిడిపి శివశంకర్ ప్రసాద్, గ్రామ వార్డు సచివాలయ నోడల్ అధికారి భీమేశ్వరరావు, డీఈవో కమల కుమారి తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు సకాలంలో అందజేయాలి

విశాలాంధ్ర - శంఖవరం : అర్హులైన లబ్ధిదారులకు ధ్రువపత్రాలను సకాలంలో అందజేయాలని శంఖవరం ఎంపీడీవో గరగ శివరామకృష్ణయ్య తెలిపారు. శుక్రవారం శంఖవరం మండలం మండపం సచివాలయంలో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమం గ్రామ సర్పంచ్ కూనిశెట్టి మాణిక్యం అధ్యక్షతన నిర్వహించారు. సురక్ష కార్యక్రమానికి ఎంపీడీవో శివరామకృష్ణ హాజరై లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడారు జగనన్న సురక్షలో అందిస్తున్న 11 రకాల సేవలను ఉపయోగించు కోవాలన్నారు. మండపం గ్రామంలో నిర్మించిన జలజీవన్ మెషన్‌లో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్‌కి విద్యుత్ కనెక్షన్ ఇప్పించినట్లయితే అందరికీ మంచినీళ్లు వస్తాయని ఉపాధి హామీ కూలీలకు జాబు కార్డులు ఇప్పించాలని ఉప సర్పంచ్ నక్కా మాణిక్యాలు ఎంపీడీవోకి విన్నవించారు. విద్యుత్తు, జాబ్ కార్డులు సమస్య పరిష్కారం చేస్తానని ఎంపీడీవో హామీ ఇచ్చారు. జిల్లా పరిషత్ హై స్కూల్‌కి గోడ నిర్మించేందుకు సహకరించాలని వి. ప్రసాద్ కోరారు. అనంతరం సచివాలయ రికార్డులను పరిశీలించారు. పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్యదర్శి కే శ్రీనివాసుని అడిగి తెలుసుకున్నారు. ఆధార్ కార్డుకి ఫోన్ నెంబర్ లింక్ చేసే ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీవో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కే శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ పి శ్రీనివాస్, వెటర్నరీ వైద్యులు కాకర్ల ప్రసాద్, విఆర్‌ఓ ఇంటిలోవరాజు, డిజిటల్ అసిస్టెంట్ రామారావు, వెల్ఫేర్ అసిస్టెంట్ త్రినాధరావు, ఉద్యానవన సహాయకులు శ్యామ్ సుందర్, సర్వేయర్ జి అభిషేక్, వెటర్నరీ అసిస్టెంట్ సతీష్ అల్లు బాబు, మహిళా పోలీస్ గౌతమి, ఏఎన్ఎం సుష్మ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లలిత తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటి సీట్లు సాధించిన అంబాజీపేట విద్యార్థులు

విశాలాంధ్ర - అంబాజీపేట : గురువారం ప్రకటించిన ట్రిపుల్ ఐటి ప్రవేశ ఫలితాల జాబితాలో అంబాజీపేట జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు సీట్లు సాధించారు. రావి రామ గోపాల నాగ ఆదిత్య తేజ ఒంగోలు క్యాంపస్‌లో కర్రా స్వర్ణ గీత నూజివీడు క్యాంపస్‌లో సీట్లు సాధించారు. వీరు ఇంతకు ముందు ప్రకటించిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో మంచి ఫలితాలు సాధించారు. రావి రామ గోపాల నాగ ఆదిత్య తేజ 600 మార్కులకు గాను 572 మార్కులు సాధించి, మండలంలో ప్రథమ స్థానంతో పాటు, నియోజకవర్గ స్థాయిలో 3వ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. కర్రా స్వర్ణ గీత 600 మార్కులకుగాను 570 మార్కులు సాధించి మండలంలో ద్వితీయ స్థానాన్ని సాధించింది. ఈ ప్రగతిని సాధించిన విద్యార్థులను మండల విద్యాశాఖాధికారులు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, డిసిఇబి సెక్రటరీ బీర హనుమంతరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కడలి సాయిరామ్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

'వికాస' కార్యాలయంలో 17న 'జాబ్ మేళా'

విశాలాంధ్ర - కాకినాడ : "వికాస" కార్యాలయంలో జూలై 17వ తేదీ సోమవారం "జాబ్ మేళా" నిర్వహిస్తున్నారు. ఈ జాబ్ మేళాలో గాంధీ సర్జికాల్స్‌లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, అకౌంటెంట్, ఎలక్ట్రిషియన్, క్యాషియర్ & హెల్పర్, బజాజ్ కాపిటల్‌లో టెలికాలర్, ఫైనాన్సియల్ అడ్వైజర్, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్, శ్రీ సత్య మారుతీ హాస్పిటల్స్ ఫిమేల్ కోఆర్డినేటర్స్, ఫిమేల్ రిసెప్షనిస్ట్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్స్, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, శాంపిల్ కలెక్షన్, నిట్ (ఐసిఐసిఐ) బ్యాంక్‌లో రిలేషన్ షిప్ మేనేజర్, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ, డిక్సాన్, ఇసుజు మోటార్స్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. డిడియుజికెవై స్కిల్ డెవలప్ మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నారు. పై ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ & బిటెక్ ఉత్తీర్ణులైన 35సం.లోపు అభ్యర్థులు అర్హులు. వీరికి నెలకు రూ. 12,000 నుండి రూ.25,000 వరకు జీతం + ఇన్సెంటివ్స్, భోజనం, వసతి & రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులందరూ జూలై 17వ తేదీ సోమవారం "వికాస కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడ ఉదయం 9.00గం.లకు సర్టిఫికెట్స్ జెరాక్స్‌లతో హాజరుకావలెను. మరిన్ని వివరాలకు 77993763333 సంప్రదించవలెను.

ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా వలంటీర్లు

విశాలాంధ్ర - మండపేట : ప్రజలకు ప్రభుత్వానికి మధ్య అనుసంధాన కర్తలుగా ఉంటూ ప్రజాసేవ చేస్తున్న వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు సరికాదని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. గత నాలుగు రోజులుగా టీవీలు, సోషల్ మీడియా, పత్రికలైన కొన్ని మీడియా సంస్థల్లో వచ్చిన వార్తలు చూస్తుంటే పచ్చ కామెర్ల వాడికి లోకం అంతా పచ్చగా కనబడిందన్న చందంగా పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలున్నాయన్నారు. జగనన్న సురక్ష ఆఖరి శిబిరాన్ని శుక్రవారం 15, 20 వార్డులకు సంబంధించి స్థానిక సీతారామ కమ్యూనిటీ హాలులో కౌన్సిలర్ గ్రంథి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సీఎం జగన్ ప్రవేశ పెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రధాని మోదీ సైతం వారి సేవలను గుర్తించి కొనియాడిన సందర్భాలు అనేకం ఉన్నాయన్నారు.
కౌన్సిలర్ గ్రంథి శ్రీనివాస్ మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డుదారులందరినీ ధనవంతులతో సమానం చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయనను ముఖ్యమంత్రి చేస్తే పేదలంతా మరింత ఉన్నతంగా ఎదుగుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ త్రిపర్ణ రామ్ కుమార్, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, ఎమ్మార్వో తంగెళ్ల రాజరాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం నీలాద్రి రావు పేట గ్రామంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. వివరాలు మేరకు అదే గ్రామానికి చెందిన మెట్టేటి చిట్టెమ్మ(75)రోడ్డు దాటుతుండగా రాజమండ్రి వైపు నుండి వైజాగ్‌వైపు వెళ్లే లారీ బలంగా ఢీకొనడంతో చిట్టెమ్మ అక్కడికక్కడే మృతి చెందగా మృతదేహం నుజ్జు నుజ్జు అయ్యింది. సమాచారం తెలుసుకున్న వెంటనే ఎస్సై వై.గణేష్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు తెలిపారు.

సంక్షేమ ఫలాల అందజేతకు సమన్వయం

ఎంపీ వంగా గీత

విశాలాంధ్ర - బ్యూరో కాకినాడ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలవుతున్న ఆరోగ్య, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు ప్రజలకు సమగ్రంగా అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కాకినాడ పార్లమెంట్ సభ్యులు వంగా గీత కోరారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కాకినాడ జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం కాకినాడ పార్లమెంట్ సభ్యులు వంగా గీత అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలు జిల్లాలో అమలు జరుగుతున్న తీరు, ప్రగతిని కమిటీ సమీక్షించింది. తొలుత చేపట్టిన వైద్య, ఆరోగ్య రంగ సమీక్షలో ఎంపీ మాట్లాడుతూ ప్రజలందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్య సేవలు, సురక్షిత మాతృత్వం, మాతా శిశు మరణాలను తగ్గించే లక్ష్యాలుగా అమలవుతున్న జాతీయ ఆరోగ్య మిషన్, ఫ్యామిలీ డాక్టర్ పథకాలను అధికారులు అంకిత భావంతో అమలు చేయాలని కోరారు. ఎంపిలాడ్స్ నిధు లతో జిల్లాలో మంజూరు చేసిన వివిధ నిర్మాణ, అభివృద్ధి పనులను రానున్న రెండు నెలల్లో పూర్తి చేసి యూసీలు సమర్పించాలని ఎంపీ కోరారు. సమావేశంలో జగ్గంపేటలో ఖాళీగా ఉన్న స్త్రీ శక్తి భవన్‌లో డిఆర్డిఏ ద్వారా మహిళల కొరకు వృత్తి శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జగ్గంపేట ఎంఎల్ఏ జ్యోతుల చంటిబాబు కోరారు. గండేపల్లి పిహెచ్సి కు సరఫరా చేసిన నూతన జనరేటర్ ఇన్‌స్టలేషన్, విరవ, మల్లాం పిహెచ్సిలలో సిబ్బంది నియామకం, పెదమల్లా పురం పిహెచ్సిలో ప్రసూతి సదుపాయాల కల్పన, శిథిలావస్థలో ఉన్న పిహెచ్సి భవనాల తొలగింపు, వాటి స్థానే క్రొత్త వాటి నిర్మాణం తదితర అంశాలను సభ్యులు జిల్లా కలెక్టరును కోరారు. సభ్యులు సూచించిన అంశాలపై సత్వర చర్యలు చేపట్టాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పి చైర్మన్ విప్పర్తి వేణు గోపాలరావు, సిఈఓ ఎ రమణారెడ్డి, ద్వామా పిడి వెంకటలక్ష్మి, డిఎంహెచ్ఓ డాక్టర్ రమేష్, డిసిహెచ్ఎస్ డాక్టర్ విష్ణువర్ధని, డిఆర్డిఏ పిడి శ్రీరమణి, ఆర్‌డబ్ల్యుఎస్ఎస్ఈ యం శ్రీనివాస రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమీషనర్లు పాల్గొన్నారు.

ఘనంగా పొన్నాడ సతీష్ కుమార్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - ముమ్మిడివరం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముమ్మిడివరం శాసన సభ్యులు పొన్నాడ వెంకట సతీష్ కుమార్ జన్మదిన వేడుకలను మహిపాల చెరువు వద్దగల గ్రాండ్ పార్క్ కన్వర్షన్ హాల్ లోఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు, పాల్గొని ఎమ్మెల్యేకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేయడానికి వచ్చినవారికి ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, సచివాలయం సిబ్బంది, వార్డు వాలంటీర్స్ ,అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు అందించేందుకు కృషి

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం ఎన్‌టి రాజాపురం గ్రామంలో శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్పిటిసి పరిమి వెంకటలక్ష్మి మంగతాయారు బాబు మాట్లాడుతూ, గ్రామంలో అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్న పార్టీ, వైయస్సార్ పార్టీ అన్నారు. అతి త్వరలో ఎన్‌టి రాజాపురం గ్రామానికి పూర్తిస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు అందించేందుకు ఇప్పటికే శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు ఆధ్వర్యంలో కలెక్టర్కు విన్నవించడం జరిగిందని ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు తప్పనిసరిగా వస్తాయని, ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. గ్రామంలో సచివాలయ సిబ్బంది అధికారులు పూర్తిగా సహాయ సహకారాలు అందించడంతో అతి తక్కువ సంఖ్యలో 170 మందికి కుల, ఆదాయ, కౌలు కార్డు తదితర పత్రాలను అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బిక్కిన దేవి దుర్గ, ఉప సర్పంచ్ పరిమిరాజు, మాజీ ఉపసర్పంచ్ పాలచర్ల సత్య నారాయణ, గోపాలపురం సర్పంచ్ పార్థసారథి తహసీల్దార్ కేవివి సత్యనారాయణ, ఎంపీడీవో బిఎస్‌కే రామన్, పంచాయతీ కార్యదర్శి తరంగణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - గోపాలపురం : కుల,మత,పార్టీలకు అతీతంగా సంక్షేమ అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. శుక్రవారం మండలంలోని కరిచర్లగూడెం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం గ్రామ సర్పంచ్ అన్సర్ భాష అధ్యక్షతన సమావేశంనిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూగ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల అర్హత గల లబ్దిదారులకు మంజూరైన సర్టిఫికెట్లు అందజేశారు. అర్హత గల ప్రతి ఒక్క లబ్ధిదారునికి సంక్షేమఫలాలు అందించడమే జగనన్న సురక్ష లక్ష్యమని, అన్నారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర అతిలాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల. భాస్కరరావు, ఎంపీడీవో ఆర్ శ్రీదేవి, ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, జడ్పిటిసి కాకులపాటి లలిత, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కోటసత్తెమ్మకు చీర సారె సమర్పించిన మంత్రి కొట్టు

విశాలాంధ్ర - నిడదవోలు : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయశాఖ అషాడమాసంలో నిర్వహించు చీర,సారే కార్యక్రమం శుక్రవారం కన్నులపండుగగా నిర్వహించారు.స్థానిక గణపతి సెంటర్ నుండి సన్నాయి మేళ,తాళలతో కోలాట నృత్యం,వివిధ దేవత మూర్తుల వేషధారణల మధ్య, భక్తజన సందోహంతో అతివైభవంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, శాసన సభ్యులు జి.శ్రీనివాస్ నాయుడు,సుమలత దంపతులు ఊరేగింపుగా వెళ్లి తిమ్మరాజుపాలెం లో వేంచేసి ఉన్న శ్రీకోటసత్తెమ్మ కు చీరా,సారే సమర్పించారు.అనంతరం శ్రీ కోటసత్తెమ్మ ఆలయ ప్రాంగణంలో రూ.1.90 కోట్ల వ్యయంతో నిర్మించిన శ్రీ కోటసత్తెమ్మ సదన్ భవన సముదాయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, నిడదవోలు మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి యలగాడ బాలరాజు, కౌన్సిలర్స్, నిడదవోలు మండల అధ్యక్షులు అయినీడి పల్లారావు, ఆలయకార్య నిర్వహణధికారి బళ్ల నీలకంఠం, ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

ప్రకటన

డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండపేట పట్టణం, 16వవార్డు, గొల్లపుంత ఏరియా కాపురస్తుడు **దుగ్గిరాల గనిరాజు కుమారుడు దుగ్గిరాల విష్ణుమూర్తి** తరపున **యస్. ఆదినారాయణమూర్తి,** అడ్వకేట్, మండపేట వారు యిచ్చిన ప్రకటన.
నా క్లయింట్ **దుగ్గిరాల విష్ణుమూర్తి,** మండపేట పట్టణానికి చెందిన రెడ్డి రాజరాజేశ్వరి వద్ద 54½ చ.గజములు ఇంటి స్థలమును క్రయంపొంది, **ది. 3-1-1984 తేదీన** మండపేట సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో రిజిష్టరు చేయించుకుని వున్నారు. సదరు క్రయ దస్తావేజు **డాక్యుమెంట్ నెం.775/84 అయివున్నది. ది. 12-7-2023** తేదీన సదరు ఒరిజినల్ దస్తావేజును జిరాక్సు తీసుకునే నిమిత్తం హ్యాండిల్ కవరులో పెట్టుకుని సైకిలుపై తన ఇంటి నుండి కలువపువ్వు సెంటరులో వున్న సాయి జిరాక్స్ షాపుకు వెళుతున్నప్పుడు మార్గం మధ్యలో పడిపోయినాయి. సదరు పైన పేర్కొనిన డాక్యు మెంట్లు దొరికిన వారు యీ క్రింది తెలియజేసిన అడ్రస్ లేదా సెల్ నెంబర్లకు తెలియజేయగలరు. తగిన బహుమతి ఇవ్వబడును.

యస్. ఆదినారాయణమూర్తి
ఎమ్.ఏ., బి.ఎల్.ఐ.సి., బి.యల్., పి.జి.డి. ఇన్ టాక్స్ లాస్ అడ్వకేట్ & నోటరి
లీగల్ అడ్వైజర్ ఫర్: స్టేట్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, తమిళ్‌నాడు బ్యాంక్, ఐ.డి.ఎఫ్.సి. బ్యాంక్, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ - మండపేట.
ఆఫీసు కమ్ స్వగృహం ఇంటి.నెం. 11-1-11, రథం గుడి దగ్గర, మండపేట-533308,
సెల్ నెం. 9849653559, 9652529939
మెయిల్ ఐడి : SANM9979.ADV@gmail.com
మండపేట. తేది : 13-7-2023,

గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా సీఎం కృషి

విశాలాంధ్ర - బ్యూరో కాకినాడ : మహాత్మా గాంధీ కలలుగన్న నిజమైన గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తెచ్చిన విప్లవాత్మక వ్యవస్థ వాలంటీర్ వ్యవస్థ అని.. వాలంటీర్లపై కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ వారికి పూర్తిభరోసా కల్పిస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం కాకినాడ జెడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జెడ్పీ ఛైర్‌పర్సన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మంత్రి వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర రహదా రులు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, పార్లమెంటు సభ్యులు వంగా గీత, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, కాకినాడ జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, జెడ్పీ ఉపాధ్యక్షులు బుర్రా అనుబాబు, ఎం.పద్మలత, ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వరరావు, కుడుపూడి సూర్యనారాయణ రావు, కాకినాడ గ్రామీణం, జగ్గంపేట శాసన సభ్యులు కురసాల కన్నబాబు, జ్యోతుల చంటిబాబు, జెడ్పీ సీఈవో ఎ.రమణారెడ్డి తదితరులు హాజరయ్యారు. వాలంటీర్ వ్యవస్థ, ఖరీఫ్ సాగు ప్రణాళిక, చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడం, ఇరిగేషన్ కార్యాచరణ, కౌలు రైతులకు రుణాలు, సీజనల్ వ్యాధుల కట్టడి, విద్యుత్ సరఫరా వ్యవస్థలు, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు తదితర అంశాలపై సమావేశంలో చర్చ జరిగింది. ఆయా శాఖలకు సంబంధించి జెడ్‌పీటీసీలు తమ ప్రాంత అంశాలను లేవనెత్తగా అధికారులు వివరణ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణను వివరిం చారు. తొలిసారిగా సర్వసభ్య సమావేశానికి హాజరైన శాసన మండలి సభ్యులు కుడుపూడి సూర్యనారాయణరావును మంత్రులు ప్రజాప్రతి నిధులు సత్కరించారు. సమావేశంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెడ్‌పీటీసీలు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా పరిషత్ పరిపాలన అధికారి ఎం.బుజ్జిబాబు తదితరులు హాజరయ్యారు.

రంగుమారిన త్రాగునీరు

సూరప్ప చెరువును సందర్శించిన సీపీఐ

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : నాగులపల్లి ఏరియా రక్షిత మంచినీటి పథకం (సూరప్ప చెరువు) నుంచి కుళాయిల ద్వారా ప్రజలకు అందించే తాగునీరు బురద రంగులో రావ దం, రెండు రోజులకు ఒకసారి రావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వివరాలలోకి వెళితే గత రెండు నెలలుగా మండలంలో సక్రమంగా మంచినీరు సరఫరా రావడం లేదు. దీనికి కారణం వేసవి కాలం కావడం, కాలువల ద్వారా నీరు రిజర్వాయర్ లోకి రాకపోవడంతో రిజర్వాయర్‌లో నిల్వ నీరు శాతం పడిపోయింది. ఉన్న నీటిని రక్షిత మంచినీటి శాఖ సిబ్బంది ఫిల్టర్ చేసి అందిస్తున్నారు. గత నెలరోజులుగా మండల శివారు ప్రాంతాల్లో రెండురోజులు, మూడురోజులకు నీటి సరఫరా చేస్తున్నారు. వచ్చే నీరు కూడా వాసన రావడం, రంగుమారి ఉండటం అలాగే వాటిలో చిన్న చిన్న పురుగులు ఉండటంతో ఈ నీరు త్రాగితే ప్రాణాలకు ఎక్కడ ప్రమాదం కగుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా శివారు ప్రాంతాలు, మత్యకార ప్రాంతాల ప్రజలు రోజుకి 20 రూపాయిలు పెట్టి స్థానిక మంచినీటి సరఫరా కేంద్రాల వద్ద కొనుగోలు చేసుకొని వెళుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని, సక్రమమైన, సురక్షితమైన న త్రాగు నీరు ప్రజలు అందించాలని కోరుతున్నారు.
సిపిఐ ఆందోళన : అధికారుల నిర్లక్ష్యం వల్లే మండలంలో మంచినీటి కొరత ఏర్పడిందని సిపిఐ నాయకులు నాయకులు ఆరోపించారు. గ్రామాలకు వాటర్ సరఫరా చేసే సూరప్ప చెరువులో ముందు జాగ్రత్తగా నీటి పొదుపుదు చెయ్యలేదని అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఈసమస్య ఏర్పడిందని సిపిఐ నాయకులు సాకా రామకృష్ణ మండిపడ్డారు. తాగునీరుపై ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఆయన తెలుసుకుని శుక్రవారం సూరప్ప చెరువులో పర్యటించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అధికారులు జీతాలు తీసుకుని ప్రజా సమస్యలు గాలికి వథిలేస్తురని బాధ్యతలు విస్మరిస్తున్నారని మండి పడ్డారు. ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేసి,ట్యాంకుల కెపాసిటీ పెంచాలని ఆయన కోరారు. మరో సారి ఇలాంటి సమస్యరాకుండా ప్రభుత్వం,అధికారులు చర్యలు చేపట్టాలని లేని పక్షాన ప్రజలతో ప్రభుత్వ కార్యాలయాల ముందు పోరాటాలు చేస్తామని సిపిఐ నాయకులు హెచ్చరించారు.

నీటి కాలుష్యంపై సమావేశం

విశాలాంధ్ర - కాకినాడ : నీటి కాలుష్యంపై వేమగిరి నుంచి సామర్లకోట వరకు సామర్ల కోట నీటిపారుదల కాలువపై కాకినాడ నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం, కాలుష్య నియంత్రణ మండలి, నీటిపారుదల శాఖ, పరిశ్రమలు, ఆర్‌డబ్ల్యుఎస్‌తో పాటు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఇంటర్ డిపార్ట్‌మెంటల్ సమావేశాన్ని నిర్వహించారు. సూపరింటెండింగ్ ఇంజనీర్, కాకినాడ నగరపాలక సంస్థ వారు పొరుగు పంచాయతీలు, నీటిపారుదల కాలువల నుండి కాలువ కాలుష్యం 18 స్థానాలను గుర్తించి కమిషనర్, కాకినాడ నగరపాలక సంస్థ వారికి అందించారు. పై ప్రదేశాల నుండి నీటి నమూనాలను కాకినాడ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ అసిస్టెంట్ ఇంజినీర్లు, & అసిస్టెంట్ ఇంజనీర్, కాలుష్య నియంత్రణ మండలి వారు సేకరించి నీటి నమూనాల విశ్లేషణ నిర్వహించి నివేదికను కమిషనర్, , కాకినాడ నగరపాలక సంస్థ వారికి సమర్పించారు. కాలువలోకి విడుదలయ్యే అన్ని మురుగునీటి పాయింట్లను గుర్తించి 21వతేదీ నాటికి కమిషనర్, కాకినాడ నగరపాలక సంస్థ వారికి నివేదిక సమర్పించాలని కమిషనర్, కాకినాడ నగరపాలక సంస్థ వారు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజ నీర్, ఆర్‌డబ్ల్యుఎస్ వారిని ఆదేశించారు. కెనాల్ కాలుష్యానికి సంబంధించి జిల్లా పంచాయతీ అధికారికి లేఖ రాయవలసిందిగా సూపరింటెండింగ్ ఇంజనీర్, కాకినాడ నగరపాలక సంస్థ వారిని కమీషనర్, కాకినాడ నగరపాలక సంస్థ వారు ఆదేశించారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర - అనపర్తి : నిత్యం ప్రజల కోసం కష్టపడే నేత సిఎం జగన్మోహన్ రెడ్డి అని అటువంటి నాయకుడిని మళ్ళీ మనం ముఖ్యమంత్రి గా చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు.శుక్రవారం కుతుకులూరు లో ఎమ్మెల్యే సత్తి గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించగా అడుగడుగునా మహిళలు హారతులతో ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్తి "విశాలాంధ్ర" తో మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి చెప్పారు. మనమందరం సంతోషం గా పార్టీ లకు,కులాలకు,మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద వానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధి చేకూరుతోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, జెడ్పిటిసి సత్తి గీతా వరలక్ష్మి వెంకటరెడ్డి, సర్పంచ్ గొల్లు హేమతులసి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బూత్ లెవెల్ అధికారులకు డోర్ టు డోర్ సర్వేకు ఆదేశాలు

విశాలాంధ్ర - తాళ్లపూడి : స్థానిక తహసీల్దార్ కార్యాలయం లో సహాయ ఎన్నికల అధికారి రాధిక ఆధ్వర్యంలో బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 21 వ తేదీ నుండి ఆగస్ట్ 31 వరకు ప్రతీ ఇంటికి బూత్ లెవెల్ అధికారి వెళ్లి డోర్ టు డోర్ సర్వే చేస్తారని వారికి తగిన సమాచారం ఇచ్చి అందరూ తమ తమ ఓట్లను పరిశీలించు కోవాలని ఎం ఆర్ ఒ రాధిక అన్నారు. మండల ఎ.యస్.ఓ జోడాల వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ప్రతీ ఇంటిని ప్రతీ ఓటరును పరిశీలించి లేని వారికి ఓటు వ్రాయలి లేదా ఓటరు లిస్ట్ లో మార్పులు కావలిస్తే చేయాలి అని తెలిపారు. కార్యాలయ పరిపాలనా అధికారి, డిప్యూటీ తహశీల్దార్ అహ్మద్ మాట్లాడుతూ ప్రతీ వారం కార్యాలయానికి ఇవ్వవలసిన సమాచారం గురించి వ ఓటరు లిస్ట్ ఎలా తయారు చేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో 44 మంది బియల్ ఓ లు ఆర్.ఐ కిషోర్, జూనియర్ సహాయకులు దీపక్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి

విశాలాంధ్ర-దేవరపల్లి: ఆంధ్ర ప్రదేశ్ ను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలంగా తీర్చిదిద్దుతున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దేనని గోపాలపల్లి ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పేర్కొన్నారు దేవరపల్లిలో జగనన్న సురక్ష సభలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ బలహీన వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి అండగా ఉంటూ అనేక కార్యక్రమాలు చేపట్టారని అన్నారు.రాష్ట్రంలో 99 శాతం హామీలు అమలు పరిచిన ఘనత తమ ప్రభుత్వానిదేనని అన్నారు. దేవరపల్లి గ్రామంలో ఇటీవల కాలంలో దాదాపు 40 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఎమ్మెల్యే తలారి తెలిపారు. 40 ఎకరాలు కొనుగోలు చేసి 1600 మందికి ఇండ్ల పట్టాలు ఇచ్చామని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి రాధాకృష్ణ, ఎంపీడీవో కృష్ణంరాజు, తహసీల్దార్ రామకృష్ణ, సర్పంచ్ కరిమి వీర కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఇటికాయలపల్లిలో జగనన్న సురక్ష

విశాలాంధ్ర-గోకవరం : గోకవరం మండలం ఇటికాయలపల్లి గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉభయ గోదావరి జిల్లాల వైయస్ఆర్ సీపీ యస్సీ సెల్ జోనల్ ఇంచార్జీ గుల్లా ఏడుకొండలు పాల్గొన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రజలకందించే సంక్షేమ పథకాలు కుల మాత పార్టీలకు అతీతంగా అందరికీ అందుతున్నాయన్నారు. 11 రకాల సర్టిఫికెట్ లు పొందాలంటే మీ సేవల వద్ద ఎమ్మార్వో ఆఫీసుల వద్ద అధికారుల చుట్టూ నాయకుల చుట్టూ తిరగవలసిన దుస్థితి గతంలో వుండేదని, ఇప్పుడు రూపాయి ఖర్చు లేకుండా ప్రజలకవసరమైన సర్టిఫికెట్‌లు వారి చేతికి ఇస్తున్న ప్రభుత్వం జగన్ మోహన రెడ్డి ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సర్పంచ్,సెక్రటరీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

త్రిబుల్ ఐటి ప్రవేశానికి ఇరువురు ఎంపిక

విశాలాంధ్ర - తాళ్లపూడి : 2023-24 సంవత్సరానికి గాను త్రిబుల్ ఐటీ ప్రవేశాలకు తాళ్లపూడి జడ్పీహెచ్ఎస్ స్కూల్ నుండి ఇరువురు విద్యార్థులకు అవకాశం కలిగిందని ఆ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు సిహెచ్ సుబ్బలక్ష్మి వెల్లడించారు. ఎస్.ఎస్.సి లో 573 మార్కులు సాధించిన కే.అనిల్ కుమార్ కు నూజివీడు ట్రిపుల్ ఐ.టి లోను, 561 మార్కులు సాధించిన ఎస్.తేజస్విని కి ఒంగోలు త్రిబుల్ ఐటీలో సీట్లు పొందారని తెలిపారు. ఈ సందర్భంగా హై స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ పి.బంగార్రాజు, ప్రధానోపాధ్యాయులు సిహెచ్ సుబ్బలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు ఇరువురికి అభినందనలు తెలియజేశారు.

ఆదినారాయణరెడ్డి మృతికి సంతాపం

విశాలాంధ్ర-బిక్కవోలు: తెలుగుదేశం పార్టీ తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పడాల ఆదినారాయణరెడ్డి గుండె పోటుతో మృతి చెందారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భంచిన నాటి నుండి క్రియాశీలకంగా వ్యవహరిస్తూ,పార్టీకి క్రమశిక్షణతో సేవలందించారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదినారాయణరెడ్డి మృతికి ప్రగాఢ సంతాపం కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

ఆటో ఢీకొని ఇరువురికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - రౌతులపూడి : మండల కేంద్రమైన రౌతులపూడిలో శుక్రవారం ఆటో మోటార్ సైకిల్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. మండలంలోని సాకిరేవు పాలెం గ్రామానికి చెందిన తల్లె ప్రసాద్(21) అదే గ్రామానికి చెందిన గుమ్మడి సతీష్(30) రౌతులపూడి మార్కెట్ సెంటర్ వైపు వెళుతుండగా గొంది కొత్తపల్లి గ్రామానికి చెందిన తుమ్మలపల్లి సతీష్ గిడజాం గ్రామం వైపు వెళుతూ బైకును ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. స్థానిక కో-ఆపరేటివ్ బ్యాంకు సమీపంలో ప్రమాదం జరగగా ఆటో డ్రైవర్ ఆటోని ఆపకుండా వెళ్ళిపోతూ ఉండడంతో స్థానికులు మోటార్ సైకిల్ పై అతనిని వెంబడించి పెట్రోల్ బంకు వద్ద పట్టుకున్నట్టు గ్రామస్తులు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన గుమ్మిడి సతీష్‌కు ఇటీవలే వివాహం జరిగినట్లు బంధువులు తెలిపారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు ప్రథమ చికిత్స చేసి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వివాహిత అనుమానాస్పద మృతి

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం రూరల్ నల్లమిల్లి గ్రామానికి చెందిన బద్రి దివ్య రమ్య (20) శుక్రవారం ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కుటుంబ వివాదాల వల్ల రమ్య ఆత్మహత్య చేసుకుందని స్థానికులు చెబుతున్నారు. పేరూరు గ్రామానికి చెందిన రమ్యకు రెండేళ్ల క్రితం నల్లమిల్లికి చెందిన బద్రి గంగరాజుతో వివాహం అయ్యింది. వీరికి సంతానం కలగలేదు. సమాచారం తెలుసుకున్న తాలూకా ఎస్ఐ అందే పరదేశి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

సమస్యలను గుర్తించి పరిష్కరించాలి

విశాలాంధ్ర-జీలుగుమిల్లి : మండలంలోని వంకవారి గూడెం సచివాలయ పరిధిలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల స్పెషల్ ఆఫీసర్ ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ పివి శ్రీనివాస్ నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని ఆయన అన్నారు. ప్రభుత్వం అందించే 11 రకాల ఉచిత సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెడుతుందని పథకాలు ప్రజలకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామంలోని రోడ్లు. మండల కేంద్రానికి వెళ్లే మార్గంలో ఉండే కల్వర్టును నిర్మించాలని గ్రామస్తులు కోరగా ఉన్నతాధికారులకు సమస్యలపై నివేదిక అందిస్తామని ఆయన అన్నారు. సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం మొక్కలను నాటారు.. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోర్స పోచమ్మ, జడ్పిటిసి మల్లం వసంతరావు, సర్పంచ్ కుంజ పార్వతి, ఎంపీటీసీలు ఎం వెంకటలక్ష్మి, సున్నం సురేష్, ఎంపీడీవో కె కృష్ణ ప్రసాద్, తహసీల్దార్ జి సుందర్ సింగ్, నాయకులు కుంజా చిన్న రాముడు, వంకా రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన శాలివాహన, కుమ్మరి సంక్షేమ, అభివృద్ధి సంస్థ చైర్మన్ పురుషోత్తం

విశాలాంధ్ర -భీమవరం : ఆంధ్రప్రదేశ్ శాలివాహన, కుమ్మరి సంక్షేమం, అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎం.పురుషోత్తం, కమిటీ సభ్యులు శుక్రవారం భీమవరం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం శాలివాహన సంస్థ ఛైర్మెన్, కమిటీ సభ్యులు జిల్లా కలెక్టరుతో మాట్లాడుతూ శాలివాహన, కుమ్మరి కమ్యూనిటీ ప్రజలందరూ రాష్ట్ర ప్రభుత్వ నవరత్నాలను పొందుతున్నారని, కమ్యూనిటీ ప్రజలను అన్ని అంశాలలో అభివృద్ధి చెందడానికి కృషి చేస్తున్నట్లు కలెక్టరుకు తెలిపారు. ఈ సందర్భంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖా అధికారి జివియస్ కె. గణపతి రావు, శాలివాహన కమిటీ సభ్యులు బిరుదుకోట చింతన్న, పెనుగొండ లక్ష్మి, సకినేటిపల్లి ఉమామహేశ్వర రావు, యర్రవరపు రామకృష్ణ, తదితరులు వున్నారు.

ఆకివీడు ఇన్‌చార్జి ఎస్ఐగా సత్యసాయి

విశాలాంధ్ర - ఆకివీడు : ఆకివీడు పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి ఎస్ఐగా టి.సత్య సాయి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆకివీడు ఎస్ఐగా పని చేస్తున్న కొవ్వూరు రాజారెడ్డి దీర్ఘకాలిక సెలవు పై వెళ్లారు. దీంతో ఇన్‌చార్జి ఎస్ఐగా సత్య సాయి ని నియమించారు. సత్య సాయి భీమవరం వన్ టౌన్, ట్రాఫిక్, ఏలూరు స్పెషల్ బ్రాంచ్, కంట్రోల్ రూమ్ లలో పనిచేశారు. విఆర్ నుండి ఈయనను ఆకివీడు ఇన్చార్జి ఎస్ఐగా నియమించారు.

17న మండల పరిషత్ సమావేశం

విశాలాంధ్ర-కామవరపుకోట : ఈనెల 17వ తేదీన కామవరపుకోట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షురాలు మేడవరపు ఛాయా విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు కామవరపుకోట ఎంపీడీవో కే శ్రీదేవి తెలిపారు. సమావేశంలో మండలంలోని పలు సమస్యలపై చర్చ జరుగుతుందని ఎంపీటీసీలు. సర్పంచులు. మండల అధికారులు హాజరుకావాలని కోరారు.

ట్రిబుల్ ఐటీలో నలుగురు గురుకుల విద్యార్థులకు చోటు

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్: పెద తాడేపల్లి లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులకు ట్రిబుల్ ఐటీ లో చోటు లభించిందని శుక్రవారం పాఠశాల ప్రిన్సిపల్ బి. రాజారావు తెలిపారు గేదెల బాబి, అయినపర్తి వెంకట్ లకు ఒంగోలులోని ట్రిబుల్ ఐటీలో, వదలి సురేష్ కుమార్,కనిపెడ కార్తీక్ లకు శ్రీకాకుళంలోని ట్రిబుల్ ఐటీలో చోటు లభించిందని ప్రిన్సిపల్ తెలిపారు. తమ పాఠశాల చెందిన విద్యార్థులు ట్రిబుల్ ఐటీ లో సీట్లు సంపాదించడం గర్వ కారణం అన్నారు సీట్లు సాధించిన విద్యార్థులు మరింత ఉన్నత విద్య ఉద్యోగ అవకాశాలు సాధించాలని ఆకాంక్షించారు నలుగురు విద్యార్థులను డి సి ఓ భారతి, ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు అభినందించారు.

టీడీపీ విజయానికి మహిళలు కృషి చేయాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించడానికి మహిళలంతా కలిసి కృషి చేస్తామని ఏలూరు పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు చింతల వెంకట రమణ తెలిపారు. శుక్రవారం మంగళ గిరిలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద జరిగిన మహాశక్తి రథయాత్రకు కొయ్యలగూడెం పట్టణం నుండి చింతల వెంకటరమణ ఆధ్వర్యంలో మహిళలంతా కలిసి తరలి వెళ్లడం జరిగిందని ఆమె పేర్కొన్నారు.

శాకంబరి అలంకరణలో కోటసత్తెమ్మ అమ్మవారు

విశాలాంధ్ర-వీరవాసరం: ఆషాఢమాస శుక్రవారం సందర్భంగా గ్రామదేవతలు కోటసత్తెమ్మ,గోగులమ్మ అమ్మవార్లను కూరగాయలు, ఆకుకూరలు, పూలు, పండ్లతో శాకంబరి రూపంలో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఆయా ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అలంకరణ చేశారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుండి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. శుక్రవారం కావడంతో మహిళలు అమ్మవార్లను అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో కమిటీ సభ్యులు, యూత్ సభ్యులు,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మానవతా సేవల్ని విస్తృతం చేయాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మానవతా సంస్థ సేవలను సంస్థ సభ్యులు మరింత విస్తృతం చేయాలని మానవతా సంస్థ జిల్లా అధ్యక్షులు గంగాధర్ పేర్కొన్నారు. స్థానిక ప్రకాశం డిగ్రీ కళాశాల వద్ద 2023 - 2024 సంవత్సరానికి నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన మండల అధ్యక్షులు బొమ్మ మోహన్ రావు, సెక్రెటరీగా తిర్నాతి సిద్ధార్థ, ట్రెజరర్ గా దిద్దే వెనేజర్, ఉపాధ్యక్షులుగా ఒబిలిశెట్టి నాగేశ్వరరావు, డైరెక్టర్లుగా బూచి త్రిమూర్తులు,మందపాటి రామకృష్ణలను నియమించి వారితో ప్రమాణ స్వీకారం చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలోకన్వీనర్ త్రిపుర రమేష్, జిల్లా సభ్యులు సూర్యనారాయణ, కేంద్ర రైల్వే బోర్డు మెంబర్ బొల్లిన నిర్మల కిషోర్, ప్రకాశం విద్యాసంస్థల కరస్పాండెంట్ వి.జనార్దన్ రావు,వి.ఎస్.ఎన్ స్వామి, ముప్పనపల్లి వెంకటేశ్వరరావు,నిడదవోలు రామారావు, రోటరీ క్లబ్ అధ్యక్షులు విశ్వనాథ శాస్త్రి,మానవతా సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత ఆర్థికాభివృద్ధికి సమగ్ర వ్యవసాయ విధానం

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం రూరల్: సమగ్ర వ్యవసాయ విధానంతో రైతుకు మేలు జరుగుతుందని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ తోలేటి జానకిరామ్ అన్నారు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెం గ్రామంలో గల డాక్టర్ వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలోని కృషి విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో గేదెల పరిశోధన స్థానం ఆధ్వర్యంలో పశుగ్రాస వారోత్సవాలు ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ నెల 7 నుంచి ప్రారంభమైన ఈ వారోత్సవాలు 14వ తేదీ శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పశుగ్రాసాల ప్రాముఖ్యత మేలుజాతి పశుగ్రాసాల సాగు గురించి అవగాహన కలిగించారు. ఈ సభకు పెంటపాడు వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ పి.మహేష్ స్వాగతం పలికారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ వైయస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జానకిరామ్ మాట్లాడుతూ వ్యవసాయం, ఉద్యానం పాడి... ఇలా వివిధ రకాల కార్యకలాపాలు అన్నింటిని సమీకృతం చేయడం ద్వారా రైతుకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. పంటతో పాటు పాడి రైతు కుటుంబాల ఆర్థిక పరిస్థితుల్లో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. వారోత్సవాల సందర్భంగా వివిధ రకాల పశుగ్రాసాలను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం హార్టికల్చర్ హబ్‌గా ప్రసిద్ధి చెందిందన్నారు. కూరగాయలు, పండ్లు ఉత్పత్తిలో దేశంలో మన రాష్ట్రం రెండవ స్థానంలో ఉందన్నారు. మామిడి, అరటి పండ్లను ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నామన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కైగాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన రైతు భరోసా కేంద్రాల ద్వారా 75% సబ్సిడీ మీద పశుగ్రాసం విత్తనాలు సరఫరా చేస్తున్నామ న్నారు. జిల్లాలో 14.36 టన్నులు పశుగ్రాస విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గేదెల పరిశోధన స్థానం హెడ్ , ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఆనందరావు మాట్లాడుతూ ఇక్కడ 60 ఎకరాలలో సూపర్ నేపియర్ పశుగ్రాసాన్ని సాగు చేసి ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు కూడా సరఫరా చేస్తున్నామన్నారు. ఈ పశు గ్రాసంతో పశువులకు పోషక విలువలు అందటమే కాకుండా అధిక పాల దిగుబడిని ఇస్తాయన్నారు. ఈ సభలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె మురళీకృష్ణ, హార్టికల్చర్ యూనివర్సిటీ విస్తరణ సంచాలకురాలు డాక్టర్ ఈ. కరుణశ్రీ , పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ విజయ భాస్కర్, వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ,, వెంకట రామన్నగూడెం గ్రామ సర్పంచ్ పోలిమోను నాగ అంజుష శ్రీనివాస్, ఇంకా పలువురు పాడి రైతులు, పశుగ్రాసం పెంపకం దారులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అద్భుతం

విశాలాంధ్ర-వీరవాసరం: రాష్ట్రంలో ప్రజలకు వలంటీర్లు అందిస్తున్న సేవలు అద్భుతమని, జగనన్న సురక్ష పథకంలో ఒకేరోజు 3,400 సర్టిఫికెట్లను ప్రజలకు, విద్యార్థులకు పంపిణీ చేయడం అంటే సాధారణ విషయం కాదని, ఈ ఘనత సాధించిన వీరవాసరం సచివాలయ పరిధిలోని వలంటీర్లను, సంబంధిత అధికారులను, ప్రజా ప్రతినిధులను అభినందిస్తున్నానని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరం 1 సచివాలయ పరిధిలో గురువారం జరిగిన జగనన్న సురక్ష పథకం సభలో 3 వేల 400 సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందించి పశ్చిమగోదావరి జిల్లాలో జగనన్న సురక్ష పథకంలో మొదటి స్థానం దక్కించుకుంది. ఈ సందర్భంగా స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ గురువారం రాత్రి వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సంబంధించి గాని ఇతర అవసరాలకు గాని అప్పటి కప్పుడు సర్టిఫికెట్లు పొందడంలో కొంతమేర ఇబ్బంది ఉంటుందని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గుర్తించి జగనన్న సురక్ష పథకాన్ని అమలు చేస్తున్నార న్నారు. ఈ పథకంలో భాగంగా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికి తిరిగి వారికి అవసరమయ్యే సర్టిఫికెట్లను అందించడం అంటే దేశంలో ఏ రాష్ట్రంలో అయినా ఇటువంటి పథకం అమలు అవుతుందా అని ఆయన ప్రతిపక్షాలను ప్రశ్నించారు. సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే జమ చేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా వలంటీర్ల పాత్ర ఎంతో కీలకమైనదని, కరోనా సమయంలో కూడా తమ ప్రాణాలను ఫణంగా పెట్టి వారికి కేటాయించిన ప్రజల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటి కప్పుడు తెలుసుకుని ప్రభుత్వానికి నివేదించే వారని ఆయన తెలిపారు.

ఆక్వా రైతులు ఐక్యంగా పోరాడాలి

- ఎఎంసి మాజీ చైర్మన్ గాంధీ భగవాన్ రాజు

విశాలాంధ్ర - పాలకొల్లు: ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యల్ని అధిగమించడానికి ఐక్యంగా పోరాడాలని పాలకొల్లు ఎఎంసి మాజీ చైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు కోరారు. శుక్రవారం పాలకొల్లు ఎస్ఎస్ఎస్ కల్యాణ మండపంలో జిల్లా ఆక్వా రైతుల సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ రొయ్యల రైతులు ఐక్యంగా లేకపోవడంతో గిట్టుబాటు ధరలు లేక నష్టాలబారిన పడుతు న్నారని చెప్పారు. ప్రాసెస్ యూనిట్లు, ఫీడ్,హేచరీలు రైతులను దోచేస్తున్నాయని రైతులు ఐక్యంగా ప్రభుత్వంతో పోరాడి గిట్టుబాటు ధర తెచ్చుకొంటే నష్టాల ఊబి నుంచి గట్టెక్కుతారని చెప్పారు. ప్రతి ఏడాది ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు క్రాప్ హాలిడే ప్రకటించాలని ఆయన కోరారు.

గిట్టుబాటు ధర రాకపోతే అవసరం అయితే ఒక ఏడాది క్రాప్ హాలిడే ప్రకటించాలని అపుడు ప్రభుత్వం తో పాటు అన్ని ఫ్యాక్టరీలు దిగి వస్తాయని అన్నారు. మరో రొయ్యల సాగు రైతు బోణం చినబాబు మాట్లాడుతూ నాణ్యమైన సీడ్ హేచరీస్ లో దొరక్క రైతులు ఆదిలోనే నష్టపోతున్నారని చెప్పారు.

రైతుల సమస్య కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసికెళ్ళాలని రైతు పెన్మెత్స సత్యనారాయణ రాజు చెప్పారు.ఆక్వాజోన్ల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీలు ఎత్తివేస్తోందని జాన్ రాజు చెప్పారు. ప్రోసెస్, ఫీడ్, సీడ్ ప్రతినిధి లతో సమావేశం ఏర్పాటు చేసి సహకరించని వారిని రైతులు బహిష్కరించాలని కోడి విజయ భాస్కర్ కోరారు. రొయ్యల్లో అనేక పోషకాలు ఉన్నాయని స్థానికంగా కూడా వాడకం పెరిగితే రొయ్యల రైతులు నష్టాల నుంచి గట్టెక్కుతారని చెప్పారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు పాల్గొన్నారు .

15, 16 తేదీల్లో మెగా జాబ్ మేళా

విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లు పట్టణంలోని బి.ఆర్.ఆర్.జి.కే ఆర్ ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో జులై 15, 16 తేదీలలో కాలేజ్ క్యాంపస్ నందు ప్రముఖ 18 కంపెనీలు సాఫ్టేర్, బ్యాంకులు, పారామెడికల్ కంపెనీలలో ఉద్యోగ నియామకాల కోసం మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు పాలకొల్లు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కారుమూరి వెంకట నరసింహారావు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు డాక్టర్ నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాసు తదితర పెద్దలను ఆహ్వానించినట్లు తెలిపారు. పాలకొల్లు, తణుకు, నరసాపురం, తాడేపల్లిగూడెం తో పాటు తూర్పుగోదావరి జిల్లాలో కొన్ని కాలేజీ విద్యార్థులను ఈ మెగా జాబ్ మేళాలో ఉద్యోగాల కోసం ఆహ్వానించామని తెలిపారు.

ఈ సంవత్సరం ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానం ఆంధ్రప్రదేశ్ డిగ్రీ హానర్స్ నన్నయ యూనివర్సిటీ ఎన్నుకున్నామని, ప్రవేశాలు తక్కువ సంఖ్యలో ఉన్నాయని ప్రభుత్వం దీనిపై ఒక ఏడాది ముందు అవగాహన కల్పించినట్లయితే బాగుండునని అన్నారు.

జీవో నెంబర్ 22 దీని ప్రకారం ఫీజు రెగ్యులేషన్ కమిటీ ఫీజులు తగ్గించాయని, ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో జీతాలు ఇవ్వాలంటే కళాశాల యాజమాన్యాలు ఈ తగ్గిన ఫీజుల విధానంతో ఇబ్బంది పడుతున్నాయని వివరించారు. ప్రిన్సిపాల్ డి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇతర దేశాలలో ఎమ్మెస్ చేయాలంటే నాలుగు సంవత్సరాల డిగ్రీ కోర్సు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కలిదిండి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

దుప్పలపూడిలో జగనన్న సురక్ష

విశాలాంధ్ర - అనపర్తి : ప్రభుత్వ సేవలు పొందడానికి అవసరమైన సర్టిఫికెట్లు అందించాలని ఉద్దేశ్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం జగన్ చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్య నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం దుప్పలపూడిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సత్తి మాట్లాడుతూ స్థానిక ఆరోగ్య కేంద్రంలో బిపి, షుగర్ వంటి వివిధ సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులకు ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ అనపర్తి టౌన్ అధ్యక్షులు నల్లమిల్లి మురళీమోహన్ బాలకృష్ణా రెడ్డి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, సర్పంచ్ వారా కుమారి తదితరులు పాల్గొన్నారు.

బాల దుర్గమ్మ ఆలయంలో తులాభారం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి బాలదుర్గమ్మ ఆలయంలో తులాభార కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామానికి చెందిన చెన్న పవన్ కుమార్ శాలిని దంపతుల కుమారునికి పటికి బెల్లంతో తులాభారం నిర్వహించారు. అంతకు ముందు అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారాయణ, కమిటీ సభ్యులు కామిశెట్టి దుర్గారావు, పైడికొండల వెంకటేశ్వరరావు, కామిశెట్టి ధర్మయ్య, కామిశెట్టి మంగ, మాజీ ఎంపీటీసీ చీట్లు కాశి అన్నపూర్ణ, సుబ్బారావు, పైడికొండల శివయ్య, మహిళా భక్తులు సంఖ్యలో పాల్గొన్నారు.

ర్యాలి గ్రామంలో జగనన్న సురక్ష

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో ర్యాలి గ్రామంలో ఒకటి ,రెండు సచివాలయాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన 11 రకాల 3888 ధృవపత్రాలను ప్రజలకు అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యులు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఎన్నో రకాల సర్వీసులను గ్రామ సచివాలయం ద్వారా అందించిన ప్రభుత్వం ఇప్పుడు ఆ సర్వీసులను ఉచితంగా ఇంటింటికి అందించే కార్యక్రమం నిర్వహించడం చాలా శుభ పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ నాతి బుజ్జి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా నెలాఖరు వరకు అన్ని సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష క్యాంపులు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిఎస్ అనిల్ కుమార్, అవుట్ సోర్సింగ్ డైరెక్టర్ కప్పల శ్రీధర్, జెడ్పిటిసి సభ్యులు బోణం సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జాయింట్ సెక్రటరీగా మద్దుల ఎంపిక

విశాలాంధ్ర- కొవ్వూరు : ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆంధ్ర ప్రదేశ్ జాయింట్ సెక్రటరీగా కొవ్వూరు చెందిన మద్దుల సత్యనారాయణ ఎంపికయ్యారు. అధ్యక్షులు కోన శ్రీనివాసరావు నుంచి నియామటి పత్రం అందుకున్నారు. ఈయన లా విద్యను అభ్యసించడమే కాక ప్రముఖ వ్యాపారిగా కొనసాగుతున్నారు గతంలో ఈయన పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా సేవలందించారు.ఈయన నియామకం పట్ల పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు పట్టణ పెద్దలు తదితరులు అభినందనలు వ్యక్తం చేశారు.

మోర్త, సూర్యారావుపాలెంలో జగనన్న సురక్ష

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: ప్రజల వద్దకు నేరుగా సంక్షేమ ఫలాలు చేరుకోవాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు మోర్త పిఎసిఎస్ త్రిసభ్య కమిటీ అధ్యక్షులు ఆలపాటి సరేంద్ర. గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు తమకు అవసరమైన వివిధ రకాల సేవలను ఉచితంగా గ్రామంలోనే పొందవచ్చని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని సూర్యారావు పాలెం, మోర్త గ్రామాలలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమంను నిర్వహిం చారు. మోర్తలో 1342, సూర్యారావుపాలెంలో 1345పత్రాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి నందిగం భాస్కర రామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి, తహసిల్దార్ జి.కనకరాజు, ఎంపీడీవో, జివిఎస్ఆర్‌కె రాజు, ఎంపీటీసీలు, ఆయా గ్రామ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది, అర్జీదారులు, అభిమానులు పాల్గొన్నారు.

అంగన్వాడి సహాయకురాలి పోస్టుకు దరఖాస్తులు

విశాలాంధ్ర - కరప : కరప మండలం కరప గ్రామం రామ కంచి రాజు నగర్ కాలనీ నందు అంగన్వాడి సెంటర్ 148లో అంగన్వాడి సహాయకురాలు పోస్ట్ ఖాళీ ఏర్పడిందని ఎంపీడీవో కే అప్పారావు తెలిపారు. ఎస్సీ కేటగిరికి చెందిన మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని ఈ దరఖాస్తులను కాకినాడ ఐసిడిఎస్ నందు ఈనెల 17వ తేదీ లోపు అందచేయాలని తెలిపారు.

కొత్త సెల్టోస్ ఆరంభంతో కియా ఇండియా ఒక మిలియన్ ప్రొడక్షన్ యూనిట్స్ సంబరాలు

విశాలాంధ్ర-రాజమండ్రి: తమ సరికొత్త ఆవిష్కరణ - ద న్యూ సెల్టోస్ మొదటి యూనిట్ ను విడుదల చేసిన కియా ఇండియా, తమ భవిష్య తయారీ సదుపాయం అనంతపురం నుండి ఒక మిలియన్ వాహనాలను పంపిణీ చేసిన చారిత్రక మైలురాయిని సంబరం జరుపుకుంది. భారతదేశంలో లభించబోయే అత్యంత అభివృద్ధి చెందిన, సురక్షితమైన, స్మార్ట్ ఎస్ యూవీలలో ఒకటైన కొత్త సెల్టోస్ ప్రొడక్షన్ ఆరంభానికి కూడా ఈ సంబరం గుర్తుగా నిలిచింది. కొత్త సెల్టోస్ ఆధునిక డిజైన్, 17 ఫీచర్స్ తో అత్యంత ఆధునికమైన లెవెల్ 2 ఏడీఏఎస్, ఎంతగానో ఎదురుచూసిన పనోరమిక్ సన్ రూఫ్ సహా 32 భద్రతా ఫీచర్స్‌తో లభిస్తోంది. ఇది జులై 14 నుండి ప్రీ-బుకింగ్సుకోసం అందుబాటులోకి వచ్చింది.

బలహీన వర్గాల అభివృద్ధికి సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర - రామచంద్రపురం : ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి వివిధ పథకాలను అమలు పరుస్తుందని వీటిని సద్వినియోగం చేసుకునే బాధ్యత లబ్ధిదారులపై ఉందని, సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుకు చేరుతున్న విధానాన్ని పర్యవేక్షించడమే గడపగడపకు మన ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటో గ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పురపాలక సంఘం పరిధిలోని రెండవ వార్డు స్టీల్ విల్ పేటలో గడపగడపకు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గడపగడపకు తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై లబ్ధిదారుల నుండి స్పందనను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం పురపాలక సంఘం చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, స్థానిక కౌన్సిలర్, ఇతర ప్రజా ప్రతినిధులు సచివాలయ సిబ్బంది తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు ఆటంకం రానివ్వం

విశాలాంధ్ర - జగ్గంపేట : విద్యార్థుల భవిష్యత్తుకు ఎక్కడ ఆటంకం రాకుండా వేరే పాఠశాలలో చేర్పిస్తామని పెద్దాపురం డివిజనల్ విద్యాశాఖ అధికారిని సుభద్ర పేర్కొన్నారు. జగ్గంపేట శ్రీ రవీంద్ర భారతి పబ్లిక్ స్కూల్ మూసి వేస్తున్నారని, పిల్లల్ని స్కూల్ యాజమాన్యం రావద్దంటున్నారని, వేరే పాఠశాలలో ఎవరు జాయిన్ చేసుకోవడం లేదని, తమ పిల్లల భవిష్యత్ ఏమిటని అధికారులకు ఫిర్యాదుతో ఆమె పాఠశాలను సందర్శించారు. పాఠశాల యాజమాన్యంతోను, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులతోను ఆమె మాట్లాడారు. 1 నుండి 5వ తరగతి వరకు ఉన్న విద్యార్థులను వేరే పాఠశాలలో చేర్పించే విధంగా ఎంఈఓకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే ఆరు నుండి పదవ తరగతి వరకు కూడా ఇప్పటికే విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేసి టీసీలు ఇవ్వడం కూడా జరిగిందన్నారు. ఇంకా ఎవరైనా ఉంటే వారిని వేరే పాఠశాలలో చేర్పించడం జరుగుతుందన్నారు. ఆమె వెంట ఎంఈఓ స్వామి ఉన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక కృషి

విశాలాంధ్ర - కిర్లంపూడి : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. గురువారం కిర్లం పూడి మండలం కృష్ణవరం గ్రామంలో 62 లక్షల రూపాయలు జల్ జీవన్ మిషన్ నిధులతో నిర్మించిన రక్షిత మంచినీటి సరఫరా పథకాన్ని, 45 లక్షల రూపాయలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామస్తులకు మంజూరైన వివిధ రకాల సర్టిఫికెట్లను ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు చేతుల మీదుగాపంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి పరచడమే కాకుండా, నవరత్నాల పేరుతో పలు ప్రజా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. గామ సర్పంచ్ గౌరకపూడి వీర అనంతలక్ష్మి గోపీనాథ్, ఎంపీటీసీ గౌరకపూడి మమతానాగు, గౌరకపూడి వెంకట్రావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గౌరకపూడి గోపినాధ్, ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు, తహసీల్దార్ కెవి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

విశాలాంధ్ర - జగ్గంపేట : జగ్గంపేట శివారు వైన్ షాపు సమీపంలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. జగ్గంపేట ఎస్సై సిహెచ్ విద్యాసాగర్‌కు వచ్చిన సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడులు నిర్వహించి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 7300 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచడం జరుగుతుందని ఎస్ఐ తెలిపారు.

గురునాథరావుకు చంద్రబాబు అభినందనలు

విశాలాంధ్ర - రౌతులపూడి : తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ రౌతులపూడి మండలం ఏ మల్లవరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త గవిరెడ్డి గురునాథరావును అభినందించారు. "మన టిడిపి యాప్"లో నిరంతరం డిజిటల్ సైనికుడిలా పనిచేసి పార్టీ కార్యకలాపాలను రాష్ట్రంలోని నలుమూలల విస్తరింప జేసినందుకు, ప్రతిపక్ష పార్టీల వైఫల్యాలను ఎత్తి చూపినందుకు 10 వేల పాయింట్లు సాధించిన సందర్భంగా పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు గురునాథరావుకు అభినందనలు తెలిపారు.

పలు గ్రామాలలో సురక్షా కార్యక్రమాలు

విశాలాంధ్ర - పెరవలి : సురక్షా కార్యక్రమం ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందని యంపిపి కార్ళ్ల సీతారామ్ ప్రసాద్అన్నారు. శుక్రవారం మండలంలోని ఖండవల్లి కాపవరం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు లబ్దిదారులకు పలురకాల పత్రాలను అందించారు. యంపిపి మాట్లాడుతూ ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం గుర్తించి అనేక పథకాల ద్వారా ప్రజలకు సర్వీసులు అందుతున్నాయన్నారు.సురక్షా కార్యక్రమం ద్వారా ప్రతీఒక్కరికి అనేక రకాల పత్రాలను ఉచితముగా పొందవచ్చునని అన్నారు.కార్యక్రమంలో తహసిల్దార్ రాజేశ్వరి, వివిధ శాఖల సిబ్బంది, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

విశాలాంధ్ర - కిర్లంపూడి : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి రానున్న ఎన్నికల్లో మళ్ళీ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి తోట నరసింహం అన్నారు. శుక్రవారం కిర్లంపూడి మండలం భూపాలపట్నం గ్రామంలో బేరి జగ్గారావు, బేరి బాబ్జి ఆధ్వర్యంలో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తోట నరసింహం మాట్లాడుతూ 2004 నుండి 2019 వరకు ఎమ్మెల్యేగా, మంత్రిగా పార్లమెంటు సభ్యునిగా జగ్గంపేట నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో జగ్గంపేట నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తోట నరసింహా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తోట బాబ్జి, అత్తులూరి సాయి బాబు, ఒబిన్ని సత్యనారాయణ, తోట వేణు, రామకుర్తి మూర్తి, ఎంపీటీసీ కొరిపల్లి చందు, ఎస్ఏ గఫూర్, అడబాల సుబ్బారాయుడు, ఒలేటి రాజు, సమ్మిటి మోహన్, వేగి రామకృష్ణ, పాలంశెట్టి సుబ్బన్న, తుమ్మల రాజా, తుల రాము, దాసరి చినబాబు, కరుటూరి శ్రీనివాస్, తాండ్రోతు గోవిందరెడ్డి, రామకుర్తి జగాలు, తోట నరేంద్ర అధిక సంఖ్యలో వైసిపి నాయకులు, తోట నరసింహం అభిమానులు పాల్గొన్నారు.